సాక్షి
నల్లగొండ
సోమవారం ı 20 ı మే ı 2024



నేటి నుంచి జయంత్యుత్సవాలు
యాదాద్రిలో సోమవారం నుంచి శ్రీనృసింహ స్వామి జయంత్యుత్సవాలు ఆగమశాస్త్రాను సారంగా ప్రారంభంకానున్నాయి. - 8లో



నెల్లిబండ జాతర ప్రారంభం
నకిరేకల్ మండల పరిధిలోని నెల్లిబండలో శ్రీలింగమంతులస్వామి, సొడమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. - 8లో

గరిష్టం / కనిష్టం
37° / 27°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజావాణికి రావద్దు
నల్లగొండ: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉండదని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి జూన్ 8 వరకు నల్లగొండ కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

ప్రాథమిక స్థాయి నుంచే క్రీడలు అవసరం



క్రీడాకారులతో ఏఎస్పీ రాములునాయక్

నల్లగొండ టూటౌన్: విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే క్రీడలు అవసరమని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు క్రీడల్లో పాల్గొనే ప్రోత్సహించాలని ఏఎస్పీ రాములునాయక్ అన్నారు. నల్లగొండలోని అవుట్‌డోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ లీగ్ పోటీలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్లబ్ వ్యవస్థాపకుడు బొమ్మపాల గిరిబాబు, సీనియర్ క్రీడాకారుడు హబీబుద్దీన్, ఖాజా అన్వర్, కోచ్ మద్ది కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌లు
సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌చార్జ్‌లుగా స్థానిక ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులను ప్రకటించారు. దేవరకొండకు మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, పార్టీ కార్మిక విభాగం నాయకుడు రాంబాబు యాదవ్‌ను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. మిర్యాలగూడకు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, సీనియర్ నాయకుడు రాజీవ్‌సాగర్‌ను, మునుగోడుకు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, సీహెచ్.రాకేష్‌కుమార్‌ను నియమించారు. నాగార్జునసాగర్‌కు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, విజయుడు, నకిరేకల్‌కు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, గువ్వల బాలరాజు, నల్లగొండకు కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, హుజూర్‌నగర్‌కు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, ఇంతియాజ్, కోదాడకు బొల్లం మల్లయ్య యాదవ్, అంజయ్య యాదవ్, సూర్యాపేటకు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, నవీన్ కుమార్‌ను నియమించారు. తుంగతుర్తికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఆలేరుకు గొంగిడి సునీత, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, భువనగిరికి పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎండీ ఇబ్రహీంను ఇన్‌చార్జ్‌లుగా ప్రకటించారు.

632 అడుగులకు మూసీ నీటిమట్టం



నీటితో కళకళలాడుతున్న మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం 632 అడుగులకు చేరుకుంది. మూసీ ప్రాజెక్టు ఎగువన ఉన్న గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగు పోస్తున్నాయి. అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం మూసీ ప్రాజెక్టుకు చేరుతుంది. దీంతో పాటు హైదరాబాద్ నగరం, మూసీ ఎగువన పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరదనీరు మూసీలోకి వచ్చి చేరుతుంది. వారం రోజుల వరకు కేవలం ఆరేడు వందల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం 3,700 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 645 అడుగుల గరిష్ట నీటి మట్టం గల మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి మట్టం 632 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.60 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

యాదాద్రిలో లక్ష పుష్పార్చన
యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలోని ఉత్సవ మూర్తులకు వివిధ పుష్పాలతో అర్చన చేశారు. ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో నిత్య కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసవేశారు. లక్ష పుష్పార్చనలో ఈఓ భాస్కర్‌రావు, అర్చకులు పాల్గొన్నారు.

పట్టు దక్కేదెవరికో?

ఎమ్మెల్సీ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు

- సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్
- చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు
- బోణీ కొట్టేందుకు బీజేపీ వ్యూహం
- పక్కా ప్రణాళికతో దూసుకెళ్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు



సాక్షిప్రతినిధి నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విజయం సాధించేందుకు మూడు ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఎలాగైనా ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలనే లక్ష్యంతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. మొన్నటి వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి ఎన్నికల సంఘం ఉప ఎన్నిక నిర్వహిస్తోంది.

గెలుపు ధీమాలో కాంగ్రెస్

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 2019లో జరిగిన ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆయన ఈసారి అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ దక్కించుకుని పోటీలో నిలిచారు. స్వతంత్ర అభ్యర్థిగానే అప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థి రాజేశ్వర్‌రెడ్డికి గట్టి పోటీ ఇచ్చిన మల్లన్నకు ఈసారి కాంగ్రెస్ పార్టీ బలం తోడైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన గెలుపును పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే జిల్లాల్లో మెజార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ వారే ఉన్నారు. అలాగే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు మల్లన్న గెలుపు కోసం శ్రమిస్తున్నారు. తద్వారా మల్లన్న గెలుపు సునాయాసం అవుతుందన్న ధీమాలో కాంగ్రెస్ పార్టీ వర్గాలు ఉన్నాయి.

సిట్టింగ్ స్థానం కోసం బీఆర్ఎస్

బీఆర్ఎస్ పార్టీ తమ సిట్టింగ్ స్థానమైన పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకునేందుకు పావులు కదుపుతోంది. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ అవే అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. నిరుద్యోగులను మోసం చేసిందని, జాబ్ చార్టును ప్రకటించలేదని, నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసిందని చెబుతూ గ్రాడ్యుయేట్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. తద్వారా బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని నిరుద్యోగ పట్టభద్రులంతా గెలిపిస్తారనే ఆశలో పార్టీ శ్రేణులు ఉన్నాయి. పైగా ఈ ఎన్నికలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పక్కా ప్రణాళికతో సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవాలని పార్టీ ప్రయత్నిస్తోంది.

నిరుద్యోగ సమస్యే అస్త్రంగా బీజేపీ ప్రచారం

ఇప్పటి వరకు నల్లగొండ జిల్లాలో బీజేపీ నుంచి ఎమ్మెల్యేలు ఎవరు విజయం సాధించలేదు. అయినా బీజేపీపై యువతలో ఎంతో క్రేజ్ ఉంది. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీవైపే యువత మొగ్గు చూపినట్లు తెలిసింది. మరోవైపు ప్రస్తుతం జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓట్లేసేది నిరుద్యోగులే కాబట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిదేళ్ల కాలంలో నిరుద్యోగులకు చేసిందేమీ లేదని, ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా మూడు నెలల్లో వాటి అమలులో విఫలమైందని, నిరుద్యోగులను మభ్యపెడుతోందని ప్రచార అస్త్రంగా వాడుతోంది. నిరుద్యోగులంతా మోదీ వైపే ఉన్నారు కాబట్టి ఈ పట్టభద్రుల ఎన్నికల్లో తమ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు ఖాయం అనే భావనలో ముందుకు సాగుతోంది.

ప్రచార వేగం పెంచిన పార్టీలు

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ప్రచారంలో వేగం పెంచాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఉమ్మడి జిల్లాలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. తాజాగా ఆదివారం సాయంత్రం హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. కోదాడలోనూ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలుపు కోసం ఇప్పటికే ప్రచారాలు నిర్వహిస్తుండగా ఆదివారం భువనగిరి, ఆలేరులో పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. బీజేపీ కూడా ఇప్పటికే రాష్ట్ర నాయకులను రంగంలోకి దింపింది. ఇటీవల కిషన్‌రెడ్డి తమ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి గెలుపుకోసం ప్రచారం నిర్వహించగా, మాజీ మంత్రి ఈటల రాజేందర్ కూడా మిర్యాలగూడ, నల్లగొండలో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొత్తానికి ప్రచారం జోరుగా సాగుతున్న ఈ ఎన్నికల్లో పట్టభద్రులు ఎవరివైపు మొగ్గుచూపుతారో తేలాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.

నాలుగు నెలల్లోనే భ్రష్టు పట్టించారు



భువనగిరిలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్ తదితరులు

- రైతులకు రుణమాఫీ చేయలేదు, భరోసా లేదు
- కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను రేవంత్ తన ఖాతాలో వేసుకుంటుండు
- బీజేపీ పాలనలో దేశంలో నిరుద్యోగం పెరిగింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- భువనగిరి, ఆలేరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాలు

భువనగిరి, ఆలేరు : 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించింది.. రైతులకు రుణమాఫీ చేయ లేదు, రైతు భరోసా లేదు, రైతుబంధు దిక్కే లేదు.. కేసీఆర్ ప్రభుత్వం 30వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేస్తే రేవంత్‌రెడ్డి తన ఖాతాలో వేసుకుని అబద్ధాలు ఆడుతున్నాడు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామావు ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పి మాట తప్పారని, ఉచిత బస్సు ప్రయాణం తప్పా ఏదీ నెరవేర్చలేదని మండిపడ్డారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గ కేంద్రాల్లో ఆదివారం మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని పట్టభద్రులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. వానాకాలం ముంచుకొస్తున్నా కొనుగోలు కేంద్రాల్లో 20 శాతానికి మించి ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. ఆటో డ్రైవర్లకు పైసలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నేరవేర్చకపోతే గల్లపట్టి, జుట్టు పట్టి బజారుకు ఈడ్వాలని పిలుపునిచ్చారు. శాసన మండలి మేధావుల సభ అని, అలాంటి చోటకు లంగలు, దొంగలను పంపితే సభకే అగౌరం ఏర్పడుతుందన్నారు. రాకేష్‌రెడ్డి రైతు కుటుంబం నుంచి వ్యక్తి అని, బిట్స్ పిలానీలో గోల్డ్ మెడల్ సాధించారని.. విద్యా వ్యవస్థ, అభివృద్ధి, నీరు, నిధులు, నియామకాల గురించి గళమెత్తి, ప్రశ్నించే గొంతుకుగా ఆయనను గెలిపించాలని కోరారు. పైళ్ల శేఖర్‌రెడ్డి మంచి నాయకుడని, ప్రజలు ఆయనను ఎందుకు కోల్పోయ్యారో అర్థం కావడం లేదన్నారు.

తెలంగాణకు గుర్తింపు తెచ్చిన ఘనత కేసీఆర్‌దే : జగదీష్‌రెడ్డి

ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపు తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి ఐదు నెలలు కావస్తున్నా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. విపక్ష పార్టీల నేతలపై కేసులు పెట్టించడం తప్ప.. పాలనపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు. కుల గణనతో బీసీలను మోసం చేస్తుందన్నారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ విధానాల వల్ల దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని విమర్శించారు. ఓట్ల కోసం రాముడి పేరు వాడుకుంటుందని దుయ్యబట్టారు.

గెలుస్తానని నమ్మకం ఉన్నా ఓడిపోయా : పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి నియోజకవర్గంలోని ప్రతి పల్లెతో పాటు భువనగిరి, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించానని, నీటి సమస్య పరిష్కరించానని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నిధులు ఇచ్చేవారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా మళ్లీ గెలుస్తానన్న నమ్మకం ఉన్నా ఓడిపోయానన్నారు. గెలిచే నమ్మకాన్ని నిలబెట్టలేకపోయానని, అందుకు తనను క్షమించాలని కోరారు.

పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తా : అభ్యర్థి రాకేష్‌రెడ్డి

ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల .రాకేష్‌రెడ్డి కోరారు. తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం పార్టీ నేతలు కేటీఆర్‌ను సన్మానించారు. అంతకు ముందు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ ఎంపీ బడుగుల లింగం యాదవ్, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్, కొల్పుల అమరేందర్, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆంజనేయులు, నాయకులుదర్శు లు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, జనగాం పాండు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, పార్టీ ప్రజాప్రతినిదులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్మాణానికి నిధుల గ్రహణం!

- మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో నిలిచిన అదనపు భవన నిర్మాణం
- ఏడాది క్రితం పనులు ప్రారంభం
- రెండంతస్తుల భవనం, స్లాబ్ పూర్తి
- నిధులు విడుదల కాక పనులు నిలిపివేత



నిలిచిన అదనపు భవన నిర్మాణ పనులు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రికి అదనంగా మరో వంద పడకలతో తలపెట్టిన నూతన భవన నిర్మాణ పనులకు నిధుల గ్రహణం పట్టుకుంది. కొత్త భవనం నిర్మించి ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని గత ఏడాది బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించి పనులు ప్రారంభించినా మధ్యలోనే నిలిచిపోయింది.

రూ.16 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు

ఆస్పత్రిలో అదనంగా నూతన బిల్డింగ్ నిర్మాణం కోసం గత ఏడాది మే నెలలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.16 కోట్లు కేటాయించింది. అదే నెల 26న అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి వచ్చి నూతన బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటినుంచి భవన నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగగా ఏడు నెలల్లో రెండంతస్తుల భవనం స్లాబ్‌లు పూర్తి చేశారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వం చేసి పనులపై ప్రస్తుత ప్రభుత్వం సమాలోచనలు చేస్తుండటంతో భవన నిర్మాణానికి నిధుల విడుదలపై సందిగ్ధత నెలకొంది. నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో బిల్డింగ్ నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో నాలుగు నెలలుగా భవన నిర్మాణం పనులు ఆగాయి.

నిర్మాణం పూర్తయితే రోగులకు మేలు

"మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చేపట్టిన అదనపు భవనం పూర్తయితే రోగులకు మేలు జరుగుతుంది. పనుల నిలిపివేతపై కాంట్రాక్టర్‌ను అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు రావట్లేదని చెబుతున్నాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భవనం పూర్తయ్యేలా కృషిచేస్తా.

– డాక్టర్ శ్రీనివాస సమరద్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, మిర్యాలగూడ

టెండర్ రద్దు యోచనలో ప్రభుత్వం?

కాగా గత ప్రభుత్వం చేపట్టిన టెండర్‌లో అవకతవకలు జరిగాయని, అప్పటి టెండర్‌ను రద్దు చేసి తిరిగి మరో టెండర్ వేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటికే పూర్తి చేసిన బిల్డింగ్‌కు ఇచ్చిన నిధులెన్ని..? బిల్డింగ్ పూర్తి కావడానికి ఎన్ని నిధులు కావాలి..? అనే విషయాలపై అధికారులు ఏమి నిర్ణయం తీసుకుంటారో అని స్థానికులు చర్చించుకుంటున్నారు. అదనపు భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా అధ్యయనోత్సవం
మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం అధ్యయనోత్సవ పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు కొనసాగించారు. సోమవారం పరమపదోత్సవం, మంగళవారం శాత్తుమరై పూజలు నిర్వహించడం జరుగుతుందని అర్చకులు తెలిపారు. అనంతరం నివేదనతో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, బ్రహ్మాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, అనంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు

లంచం ఇస్తేనే కాంట్రాక్టర్లకు బిల్లులు

- మాజీ మంత్రి ఈటల రాజేందర్

నల్లగొండ టూటౌన్: ఏడు నుంచి 10 శాతం వరకు లంచం ఇస్తేనే కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు ఇస్తున్నారని మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆరోపించారు. ఆదివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని, గతంలో హోంమంత్రి అమిత్‌షా చెప్పారని, ఆ దిశగానే అన్ని డిపార్టుమెంట్లలో దుకాణాలు ఓపెన్ చేశారన్నారు. గత ప్రభుత్వం వంద రూపాయలు తీసుకుంటే ప్రస్తుత ప్రభుత్వం రూ.200 తీసుకుంటోందన్నారు. సీఎం వద్దే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉందని, బిల్డింగ్‌లకు అనుమతులు కూడా ఇవ్వకపోవడంతో రియల్ ఎస్టేట్ కుప్ప కూలిందన్నారు. ఆరు గ్యారంటీలు, 66 హామీలలో కేవలం మహిళలకు ఉచిత ప్రయాణం ఒక్కటే అమలైందన్నారు. వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేసి ఆశీర్వదించాలని ఈటల రాజేందర్ కోరారు. ఎవరూ ఊహించని రీతిలో బీజేపీకి ఎంపీ సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, శానంపుడి సైదిరెడ్డి, సంకినేని వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, సుభాష్‌చందర్, శ్రీదేవిరెడ్డి, నివేదిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

సుందరయ్య జీవితం.. ఆదర్శం



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య తనకున్న వందల ఎకరాల భూములను పేదలకు పంచారన్నారు. పార్లమెంట్‌కు, శాసన సభకు సైకిల్‌పై వెళ్లి తన నిరాడంబరతను చాటుకున్న మహానేత సుందరయ్య అని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన త్యాగధనుడు పుచ్చలపల్లి అని గుర్తుచేశారు. ఆయన ఆశయసాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నారి ఐలయ్య, సయ్యద్ హాశం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, ఎండీ.సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, దండెంపల్లి సరోజ, భూతం అరుణకుమారి, మన్నె భిక్షం, బొల్లు రవీంద్రకుమార్, నర్సింహ, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

- 50 శాతం సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు
- వర్షాలు కురుస్తుండడంతో అందుబాటులో ఉంచిన వ్యవసాయ శాఖ
- నేటి నుంచి డీసీఎంఎస్, రైతు సహకార సంఘాల్లో విక్రయం



నల్లగొండలోని నాగార్జున సహకార సంఘంలో అందుబాటులో ఉంచిన జనుము విత్తనాలు

నల్లగొండ అగ్రికల్చర్: వానాకాలం సీజన్ ఆరంభానికి ముందే జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పచ్చిరొట్ట ఎరువుల కోసం జనుము, జీలుగ విత్తనాలు చల్లుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు అందుబాటులో ఉంచేందుకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు సిద్ధం చేసింది. వీటిని జిల్లాకేంద్రంలోని లతీఫ్‌సాబ్ గుట్ట వద్ద గల నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘంతోపాటు చిట్యాల, నార్కట్‌పల్లి, వేములపల్లి, దామరచర్ల ప్రాథమిక సహకార సంఘాలతో పాటు టీఎస్ సీడ్ కార్పొరేషన్ నిడమనూరు కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉంచారు.

విత్తనాల ధరలు ఇలా (రూపాయల్లో)..

విత్తనం	బ్యాగు(కేజీల్లో)	పూర్తి ధర	సబ్సిడీ	రైతువాటా
జీలుగ	30	2,790	1,674	1,116
జనుము	40	3,620	2,172	1,448

ఆన్‌లైన్‌లోనే అమ్మకాలు



పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము విత్తనాలు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అమ్మకాలు ఉంటాయి. రైతులు విధిగా తమ భూమి పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకెళ్లి సంబంధిత కేంద్రాల్లో కొనుగోలు చేయాలి. ఆన్‌లైన్‌లో చేయకపోతే సబ్సిడీ వర్తించదు.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

విక్రయానికి ఏర్పాట్లు

ప్రస్తుతం ఆయా సంఘాల్లో 30కిలో బ్యాగులు 248 వరకు జీలుగ, 40 కిలోలవి 160 బ్యాగుల జనుము విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచారు. రైతుల డిమాండ్‌ను బట్టి సోమవారం నుంచి అన్ని సహకార సంఘాల్లో వీటిని విక్రయించడానికి వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. వీటిని 50 శాతం సబ్సిడీపై విక్రయించనున్నారు. ఈ విత్తనాలను ఆయా సెంటర్లలో ఆన్‌లైన్‌లో విక్రయిస్తారు.

క్లుప్తంగా

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం


శ్రీకాంత్ మృతదేహం

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఈత కొట్టేందుకు వెళ్లి వ్యవసాయ బావిలో గల్లంతైన బాలుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. వివరాలు.. తిరుమలగిరి మండల కేంద్రంలో నివాసముంటున్న చిన్నూరు వెంకటయ్య, మాధవి దంపతుల కుమారుడు శ్రీకాంత్ (13) శనివారం సాయంత్రం తన తండ్రి, సోదరితో కలిసి స్థానికంగా పాలెపు చంద్రశేఖర్‌కు చెందిన వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మోటార్ల ద్వారా వ్యవసాయ బావిలోని నీటిని బయటకు పంపగా.. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో శ్రీకాంత్ మృతదేహం బయటపడింది. వెంటనే మృతదేహాన్ని తుంగతుర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఘటనా స్థలంలో శ్రీకాంత్ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

యువతి అదృశ్యం


షేక్ కరిష్మా

నిడమనూరు: మండలంలోని రాజన్నగూడేనికి యువతి శనివారం అదృశ్యమైంది. ఆదివారం ఎస్‌ఐ గోపాలరావు ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నగూడేనికి చెందిన షేక్ కరిష్మా(23) శనివారం సాయంత్రం గ్రామంలోనే తన స్నేహితురాలు పుట్టినరోజు ఉందని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం కరిష్మా తల్లి షేక్ అనీఫా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా కరిష్మా ఇంటర్ వరకు చదివి గత రెండు సంవత్సరాల నుంచి ఇంటి వద్దనే ఉంటూ కుట్టుమిషన్ పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎంపీటీసీ సభ్యురాలి భర్తపై దాడి


గాయపడిన తిరుపతిరెడ్డి

రాజాపేట: మండలంలోని పారుపల్లి గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు భర్తపై ఆదివారం దాడి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పారుపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు రాపోలు కవిత, ఆమె భర్త తిరుపతిరెడ్డి కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా... గ్రామంలోని బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన గీరెడ్డి భాస్కర్‌రెడ్డి వారి కారును ఆపి తాను కూడా హైదరాబాద్‌కు వస్తున్నానని చెప్పడంతో కారు ఎక్కించుకున్నారు. అనంతరం ఏదో పని నిమిత్తం వారు తిరిగి గ్రామంలోకి వస్తుండగా.. ఎదురుగా బూర్గుపల్లి గ్రామం మాజీ పట్వారీ మల్లారెడ్డి కనిపించడంతో కారు నుంచి దిగిన గీరెడ్డి భాస్కర్‌రెడ్డి మల్లారెడ్డిపై దుర్భాషలాడాడు. అడ్డుకోబోయిన తిరుపతిరెడ్డిపై భాస్కర్‌రెడ్డి దాడి చేయడమే కాకుండా కారు అద్దాలు పగులగొట్టాడు. భాస్కర్‌రెడ్డిపై తిరుపతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరుపతిరెడ్డిని రాజాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి నృసింహుడి జయంతి ఉత్సవాలు

- ఉదయం 8.30గంటలకు స్వస్తివాచనంతో శ్రీకారం
- యాదాద్రి ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు ఆగమశాస్త్రానుసారంగా ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అర్చకులు, అధికారులు పూర్తిచేశారు. ప్రధానాలయాన్ని ఇప్పటికే విద్యుత్ దీపాలతో అలంకరించారు. మామిడి, అరటి తోరణాలతో ఆధ్యాత్మిక శోభ కలిగే విధంగా తీర్చిదిద్దారు.

స్వస్తివాచనంతో శ్రీకారం..

సోమవారం ఉదయం 8.30గంటలకు ఆలయంలో స్వస్తివాచనంతో జయంతి ఉత్సవాలకు అర్చకులు శ్రీకారం చుడతారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం జరిపిస్తారు. ఆ తర్వాత లక్ష కుంకుమార్చన నిర్వహించి, తిరు వేంకటపతి అలంకార సేవలో ఆలయ తిరు, మాఢ వీధుల్లో స్వామివారిని ఊరేగిస్తారు. సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణ, హవనం జరిపించి, గరుఢ వాహనంపై పర వాసుదేవ అలంకార సేవను ఆలయ తిరు, మాఢ వీధుల్లో భక్తుల మధ్యన ఊరేగిస్తారు.


విద్యుత్ దీపాల వెలుగుల్లో ముఖ మండపం

పాతగుట్ట ఆలయంలో..

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సైతం సోమవారం నుంచి శ్రీనృసింహ జయంతి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఉదయం 9.30గంటలకు స్వస్తీవాచనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విక్ వరణం, లక్ష కుంకుమార్చన జరిపిస్తారు. సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణ, హవనం నిర్వహిస్తారు.

సంగీత మహాసభలు..

జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయ సన్నిధిలో భజన, భక్తి సంగీతం, భరతనాట్యం, కూచిపూడి నృత్యం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేసిన అధికారులు, కళాకారులకు సైతం ఆహ్వానాలు అందజేశారు. మూడ్రోజుల పాటు ఈ సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయి.

ఆర్జిత సేవలు రద్దు..

జయంతి ఉత్సవాల్లో భాగంగా భక్తులచే నిర్వహించే నిత్య, శాశ్వత కల్యాణం, సుదర్శన హోమం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు వంటి ఆర్జిత సేవలను అధికారులు రద్దు చేశారు. మూడ్రోజుల పాటు భక్తులు సహకరించాలని ఆలయాధికారులు కోరారు.

సాంస్కృతిక వేదిక ముందు దేవతామూర్తులు

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో ధార్మిక, సాహిత్య, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఆలయాధికారులు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సాంస్కృతిక వేదిక ముందు గరుడ్మంతుడు, ఆంజనేయస్వామి రూపాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఫైబర్‌తో తయారుచేసిన విగ్రహాలు యాదాద్రి కొండపైకి చేరుకున్నాయి.


సాంస్కృతిక వేదిక ముందు ఏర్పాటుచేసే విగ్రహాలు

రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు

- దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- బాధితులంతా మెదక్ జిల్లా వాసులు

మిర్యాలగూడ అర్బన్: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని నందిపహాడ్ బైపాస్ వద్ద ఆదివారం జరిగింది. టూటౌన్ ఎస్‌ఐ క్రిష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన మెగావత్ భోజ్య తన కుటుంబ సభ్యులతో కలిసి టాటా ఏస్ వాహనంలో దామరచర్ల మండలం కల్లేపల్లిలో గల మైసమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. మొక్కులు చెల్లించుకుని ఆదివారం తిరిగి వెళ్తుండగా.. మిర్యాలగూడ పట్టణంలోని నందిపహాడ్ బైపాస్ క్రాసింగ్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో వాహనం స్లో అయింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన కంటైనర్ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనంలో ఉన్న మెగావత్ భోజ్య, పూర్ణ, చరణ్, అనూషతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లే యోచనలో పుడమి నిర్వాహకులు

మునుగోడు: అధిక వడ్డీ ఇస్తామని ఆశచూపి అమాయక ప్రజల నుంచి వందల కోట్ల రూపాయలు వసూలు చేసిన పుడమి ప్రాజెక్ట్స్ నిర్వాహకులు ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కంపెనీ నిర్వాహకులతో పాటు అందులో పెట్టుబడి పెట్టించిన ఏజెంట్లను సైతం స్థానికంగా ఉండకుండా కొద్దిరోజుల పాటు దూర ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టించిన ఏజెంట్లను డీజీఎంలుగా పిలిచేవారు. డీజీఎంలుగా పనిచేస్తున్న వారితో పాటు కంపెనీ నిర్వాహకులు కలిసి ఓ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ఏ విషయాన్ని అయినా నిర్వాహకులు ఈ వాట్సాప్ గ్రూప్ ద్వారానే డీజీఎంలకు చేరవేసేవారు. కొంతకాలంగా పెట్టుబడి పెట్టిన వారు తమ డబ్బులు తమకు ఇవ్వాలని ఏజెంట్ల(డీజీఎం)పై ఒత్తిడి తీసుకొస్తున్నారు. వీటన్నింటిని డీజీఎంలు ఆ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేస్తుండటంతో పాటు ఇటీవల పుడమి ప్రాజెక్ట్స్ మోసం గురించి సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితం కావడంతో నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. డీజీఎంలు అంతా ఆ వాట్సాప్ గ్రూపులో తమ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు పంపాలని నిర్వాహకులు గత కొద్దిరోజులుగా కోరుతున్నారు. అయినా ఎవరూ ఫొటోలు పంపకపోవడంతో ఎందుకు ఫొటోలు పంపడం లేదని నిర్వాహకులు డీజీఎంలను ప్రశ్నించినట్లు తెలిసింది. కొందరు డీజీఎంలు మా ఫొటోలు ఎందుకు పంపమంటున్నారని, పంపితే ఏమిచేస్తారని అడిగితే నిర్వాహకులు ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదని తెలుస్తోంది. దీంతో కంపెనీ నిర్వాహకులతో పాటు ఏజెంట్లు విహారయాత్ర పేరుతో ఇతర ప్రాంతాలకు వెళ్తే కొద్దిరోజుల తర్వాత పెట్టుబడి పెట్టిన వారు మరిచిపోతారనే భావనలో నిర్వాహకులు ఉన్నట్లు తెలుస్తోంది.

దిక్కుతోచని స్థితిలో బాధితులు..

ప్రతి నెలా వడ్డీతో పాటు పాట్లు వస్తుందని భావించి పెట్టుబడి పెట్టి మోసపోయిన బాధితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమ ఆస్తులు, బంగారు ఆభరణాలు సైతం అమ్ముకొని పెట్టుబడి పెట్టి రోడ్డున పడ్డామని, పోలీసులు తమకు అండగా నిలబడాలని వేడుకుంటున్నారు. తమకు వడ్డీ రాకున్నా పర్లేదని, కనీసం అసలైనా ఇప్పిస్తే చాలని కోరుతున్నారు. ఏజెంట్ల వద్దకు వెళ్తే తాము ఏమీ చేయలేమని, కంపెనీ నిర్వాహకులు బయటకి వస్తేనే ఆ కంపెనీ పేరుతో కొనుగోలు చేసిన ఆస్తులు అమ్మి ఎవరి డబ్బులు వారికి తిరిగి ఇప్పిస్తామని చెప్తున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు.

లారీని ఢీకొట్టిన గూడ్స్ వాహనం

- నలుగురికి గాయాలు

చిట్యాల: ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో దానిని తప్పించే క్రమంలో గూడ్స్ వాహనాన్ని డ్రైవర్ ఒక్కసారిగా పక్కకు తిప్పగా.. మరో లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన చిట్యాల పట్టణ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి ఏపీలోని నెల్లూరుకు వెళ్తున్న గూడ్స్ వాహనం చిట్యాల పట్టణ శివారులోని మహేశ్వరి దాబా వద్దకు రాగానే.. ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో గూడ్స్ వాహనం డ్రైవర్ వాహనాన్ని పక్కకు తిప్పగా.. అక్కడే ఉన్న మరో లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గూడ్స్ వాహనం డ్రైవర్ బాబుతో పాటుగా బిహార్ రాష్ట్రానికి చెందిన కార్పెంటర్ వర్కర్స్ రాహుల్‌కుమార్, చందన్‌కుమార్, మనీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరు వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుపోవటంతో పక్కనే ఉన్న మెకానిక్ వర్కర్స్‌తో పాటు కానిస్టేబుళ్లు సాయి, ఖలీం వారిని బయటకి తీశారు. అనంతరం వారిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.


నుజ్జునుజ్జయిన గూడ్స్ వాహనం

లారీ డీజిల్ ట్యాంక్ పేలి చెలరేగిన మంటలు

భువనగిరి క్రైం: పట్టణంలోని నల్లగొండ రోడ్‌లో గల నయారా పెట్రోల్ బంక్ వద్ద లారీ డీజిల్ ట్యాంక్ పేలి మంటలు చెలరేగాయి. పెట్రోల్ బంక్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. వివరాలు.. ఆదివారం మధ్యాహ్నం ఓ లారీ డీజిల్ పోయించేందుకు నయారా పెట్రోల్ బంక్‌లోకి వెళ్లగా.. ఒక్కసారిగా లారీ డీజిల్ ట్యాంక్ పేలి మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన పెట్రోల్ బంక్ యజమాని జహీర్ హుస్సేన్ తమ వద్ద ఉన్న డ్రై కెమికల్ పౌడర్ సిలిండర్ ద్వారా మంటలు అదుపులోకి తెచ్చారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. డీజిల్ ట్యాంకర్ పేలిన సమయంలో బంక్‌లో ఉన్న వారు భయభ్రాంతులకు గురై పరుగులుతీశారు. లారీ డ్రైవర్ లారీని వదిలేసి పరారయ్యాడు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయగా వారు మంటలు అదుపులోకి వచ్చిన తర్వాత అక్కడకు చేరుకున్నారు.

కనగల్ వంతెన కింద వ్యక్తి మృతదేహం లభ్యం


కృష్ణ (ఫైల్)

కనగల్: మండల కేంద్రంలోని వంతెన కింద ఆదివారం సాయంత్రం స్థానికులు ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం సమీపంలో ఓ బ్యాగు లభించగా అందులో మృతుడి దుస్తులు, ఆధార్ కార్డు లభించాయి. ఆధార్ కార్డులోని చిరునామా ప్రకారం.. మృతుడి పేరు సముద్రాల కృష్ణ (50), న్యూ గుండ్లపల్లి గ్రామం, యాదగిరిగుట్ట అని ఉంది. మృతదేహం పాడైపోవడంతో నాలుగైదు రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని కాల్చేందుకు దుండగులు విఫలయత్నం చేసిన ఆనవాళ్లు కనిపించాయి. మృతుడి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చండూరు సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ రామకృష్ణగౌడ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కృష్ణ యాదగిరిగుట్టకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి అని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదని సమాచారం. వేరే ప్రాంతంలో హత్యచేసి ఇక్కడ పడేశారా లేదా ఇక్కడే చంపి పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భువనగిరిలో గుర్తుతెలియని వ్యక్తి..



భువనగిరి రూరల్: మండలంలోని గచ్చుబావి వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చుబావికి చెందిన చాగంటి జహంగీర్ వ్యవసాయబావి వద్ద సుమారు 45 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించగా.. అతడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు డ్రాయర్ మాత్రమే ఉందని పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి మతిస్థిమితం సరిగ్గా లేదని, ఇటీవల వివేరా హోటల్ చుట్టుపక్కల తిరుగుతూ ఉండేవాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 8712662472 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నెల్లిబండ గట్టు జాతర ప్రారంభం


లింగమంతులస్వామి, సొడమ్మ అమ్మవార్లు

నకిరేకల్: మండల పరిధిలోని నెల్లిబండ గుట్ట మీద కొలువైన శ్రీలింగమంతులస్వామి, సొడమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు రానున్నారు. ప్రతి రెండేళ్లకోసారి నెల్లిబండ గట్టు జాతర జరుగుతుంది. ఆదివారం రాత్రి నెల్లిబండ గ్రామంలోని మిద్దెగూడెం నుంచి భజన, బేరీ చప్పుళ్లతో దేవరను ఊరేగింపుగా తీసుకొని గట్టుమీదికి చేర్చడంతో జాతర ప్రారంభమైంది.

నేటి కార్యక్రమాలు

సోమవారం ఉదయం 6గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 7గంటలకు కుంకుమార్చన, కంకణధారణ, 8గంటలకు బోనాలు, యాటల బలి, సాయంత్రం 5గంటలకు ఆకువంచమ బోనం, మంగళవారం సాయంత్రం 4గంటలకు పసుపుకుంకుమలతో దేవుని పటం (చిత్రపటం) వేస్తారని ఆలయ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డి తెలిపారు.

యాదాద్రి కొండపై ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు


మాడ వీధిలో ఏర్పాటు చేస్తున్న ఎల్‌ఈడీ స్క్రీన్

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారి కైంకర్యాలు మాడ వీధిలో వీక్షించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే యాదాద్రి ఆలయ తూర్పు మాడ వీధిలోని బ్రహ్మోత్సవ మండపం వద్ద భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను బిగిస్తున్నారు. ఆలయంలో జరిగే నిత్య కల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం తదితర పూజలను భక్తులు నేరుగా ఆలయ మాడ వీధిలో నుంచి వీక్షించనున్నారు. త్వరలోనే ఈ ఎల్‌ఈడీ స్క్రీన్ బిగింపు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురానున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని అల్లందేవిచెర్వు గ్రామంలో తాళం వేసిన ఇంట్లో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. అల్లందేవిచెర్వు గ్రామానికి చెందిన ఎల్లంకి సత్తమ్మ శనివారం ఇంటికి తాళం వేసి మునుగోడులో తమ బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగులకొట్టి లోపలికి చొరబడి బీరువాలో ఉన్న రూ.25వేలు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం గ్రామస్తులు దొంగతనం జరిగినట్లు గుర్తించి సత్తమ్మకు, పోలీసులకు సమాచారం అందించారు. అదే గ్రామంలో మరో ఇంట్లో కూడా దుండగులు చోరీ యత్నం చేయగా.. ఆ ఇంట్లోని వారు నిద్ర లేవడంతో పారిపోయారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో తీన్మార్ మల్లన్నతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు ఉంటుందని, సూర్యాపేట జిల్లాలోని అన్ని ఓట్లు తీన్మార్ మల్లన్నకు పడే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. తీన్మార్ మల్లన్న గెలిచిన తర్వాత విజయోత్సవ ర్యాలీ సూర్యాపేటలోనే ఉంటుందని అన్నారు. ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేసి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషిచేయాలని అన్నారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి తన వెన్ను తట్టి ప్రోత్సహించారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు దోసపాటి గోపాల్, చకిలం రాజేశ్వర్‌రావు, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, పీసీసీ సభ్యుడు కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, సీపీఎం నాయకులు మల్లు లక్ష్మి, మల్లు నాగార్జునరెడ్డి, అంజాద్ అలీ, ధరావత్ వీరన్న నాయక్, సురేష్‌రావు, కాకి కృపాకర్‌రెడ్డి, కక్కిరేణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్డీఆర్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

శతాధిక వృద్ధురాలు మృతి


మల్లమ్మ (ఫైల్)

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు దోరెపల్లి మల్లమ్మ (108) మృతి చెందారు. వడదెబ్బతో ఆమె అస్వస్థతకు గురై ఆదివారం మరణించారు. స్వగ్రామంలో మూడో కుమారుడి వద్ద మల్ల మ్మ ఉంటుంది. ఆమెకు ఆరుగురు కుమారులు, ఒక కుమార్తెతో పాటు మనుమలు, మనుమరాళ్లు, మునిమనుమలు, మునిమనమరాళ్లు ఉన్నారు. ఆమె పెద్ద కుమారుడు దోరెపల్లి యల్లయ్య సీపీఎం తరపున గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. మల్లమ్మ మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

కోదాడ: అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యావంతులు తగిన బుద్ధి చెప్పాలని, వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి కోరారు. ఆదివారం రాత్రి కోదాడలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే కాంగ్రెస్ అసమర్థ పాలనపై ప్రజలకు విసుగు వచ్చిందని అన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. క్వింటా వరికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యావంతులు ఆలోచించి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, కటికం సత్తయ్య గౌడ్, చింతా కవిత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు సహకారం

- భారత్ సహకార సేవా ఫోరం వ్యవస్థాపకుడు బసవరాజు శ్రీనివాస్


మాట్లాడుతున్న బీఎస్ఎస్ఎఫ్ వ్యవస్థాపకుడు బసవరాజు శ్రీనివాస్

చౌటుప్పల్: రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని భారత్ సహకార సేవా ఫోరం వ్యవస్థాపకుడు బసవరాజు శ్రీనివాస్ తెలిపారు. కోల్డ్ స్టోరేజీల (గిడ్డంగులు) నిర్మాణానికి సైతం ప్రభుత్వంతో కలిసి తోడ్పాటు అందిస్తామన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లింగారెడ్డిగూడెం గ్రామంలోని జీఎన్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బీటీ విత్తనాల వాడకం, సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆదివారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. పంట నిల్వ, సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉంటే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలన్న సంకల్పంతో తమ సంస్థ రాయితీపై విత్తనాలు, సేంద్రీయ ఎరువులను అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు మాట్లాడుతూ.. బీఎస్ఎస్ఎఫ్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అంతకుముందు బీఎస్ఎస్ఎఫ్ వ్యవసాయరంగ నిపుణుడు పురుషోత్తంశర్మ రైతులకు సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనం, రసాయన ఎరువులతో ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. కార్యక్రమంలో బీఎస్ఎస్ఎఫ్ పీసీఎం పవన్, బీఎస్ఎస్ఎఫ్ ప్రిసీడింగ్ కౌన్సిల్ మెంబర్ బొబ్బిళ్ల మురళి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, పెద్దకొండూర్ మాజీ సర్పంచ్ బద్దం పాండురెడ్డి, రైతులు కంచరకుంట్ల వెంకట్‌రెడ్డి, భీమిడి మల్లారెడ్డి, అత్తాపురం నరేందర్‌రెడ్డి, బత్తుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ ప్రధాని కావడం కలే..

- మాజీ మంత్రి ఈటల రాజేందర్

మిర్యాలగూడ టౌన్: దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయడానికి ఎంపీ అభ్యర్థులు కూడా లేరని, రాహుల్‌గాంధీ దేశ ప్రధాని కావడం కలేనని మాజీ మంత్రి, బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ఎంవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలల్లోనే ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని అన్నారు. ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే అమలయ్యిందని పేర్కొన్నారు. కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకతతోనే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. తెలంగాణలో బీజేపీ అత్యధిక ఎంపీ సీట్లు గెలుచుకోబోతుందని అన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో 10 నుంచి 12 ఎంపీ సీట్లను బీజేపీ గెలవబోతుందన్నారు. నాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్మును కాజేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఎన్. రాంచందర్‌రావు, కాటేపల్లి జనార్దన్, ఆర్‌ఎస్‌ఎస్ నల్లగొండ విభాగ్ సంచాలక్ గార్లపాటి వెంకటయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారీ గోగిరెడ్డి లచ్చిరెడ్డి, నాయకులు రేపాల పురుషోత్తంరెడ్డి, హన్మంతరెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రావు, చెరుపల్లి కరుణాకర్, నాగిరెడ్డి, అశోక్‌రెడ్డి, సత్యప్రసాద్, బంటు సైదులు, రమేష్, కర్నాటి ప్రభాకర్, కొండేటి సరితాశేఖర్, రవికుమార్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

గూడ్స్ వాహన డ్రైవర్ హత్య

కట్టంగూర్: గూడ్స్ వాహన డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. కట్టంగూర్ ఎస్‌ఐ ఎన్. శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కృష్ణా జిల్లా పామర్రు మండలం చెట్టవారిగూడేనికి చెందిన కొల్లూరి రాజవర్ధన్(35) శనివారం గూడ్స్ వాహనంలో ఇంటి సామాను లోడ్ చేసుకుని విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లాడు. హైదరాబాద్‌లో సామాను అన్‌లోడ్ చేసి రాత్రి విజయవాడకు బయల్దేరాడు. మార్గమధ్యలో కట్టంగూర్ మండలం ఎరసానిగూడెం స్టేజీ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు రాజవర్ధన్‌ను అడ్డగించి కాళ్లు, చేతులు తాళ్లతో కట్టేసి హత్య చేసి మృతదేహాన్ని రోడ్డు పక్కన పడేశారు. ఆదివారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రాజవర్ధన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు